క్లుప్తంగా

సన్మానం

ఆదిలాబాద్: ఇటీవల జాతీయస్థాయిలో అవార్డు అందుకున్న పాయల్ ఫౌండేషన్ చైర్మన్ పాయల్ శరత్‌ను బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలో శనివారం సన్మానించారు. పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించడంతో దీనిని గుర్తిస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆరోగ్య సేవల విభాగంలో ఉత్తమ అవార్డుకు ఫౌండేషన్ ఎంపికైంది. జైపూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాయల్ శరత్ పురస్కారాన్ని అందుకున్నారు. నాయకులు నగేశ్, దినేష్ మటోలియా, జోగు రవి, వంశీ యాదవ్, భీమ్సేన్ రెడ్డి, నగేశ్‌రెడ్డి, శివగౌడ్ పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

తలమడుగు: మండలంలోని పల్సి(బి) గ్రామంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర బ్యాంకు స్పెషల్ ఆఫీసర్ కాడే స్వామి తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం ఉదయ 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ పాల్గొంటారన్నారు. ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు క్రీడా పరుగు

ఆదిలాబాద్: సీఎం కప్-2024 పోటీల ప్రారంభోత్సవంలో భాగంగా ఆదివారం క్రీడా పరుగు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మావల మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు మధ్యాహ్నం మూడు గంటలకు క్రీడాకారులు క్రీడాజ్యోతిని చేబూని పరుగులో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐటీఐలో వాక్ఇన్ అడ్మిషన్స్

ఎదులాపురం: ఆదిలాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఆరో విడత (వాన్ఇన్) అడ్మిషన్స్ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ఐదు విడతల్లో కేటాయించబడని అభ్యర్థులు, ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 5 నుంచి 9వరకు గడువుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 94935 35378 సంప్రదించాలన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సునీల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని హత్తిగుట్టకు చెందిన గేడం లక్ష్మణ్‌కు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ శనివారం సెల్‌ఫోన్‌ను అప్పగించారు. లక్ష్మణ్ గత ఏడాది ఆగస్టులో పట్టణంలోని నేతాజీచౌక్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు ఐసీఎంఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా, సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి అందించినట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని గణేష్ మందిర్ వద్ద సీఐ కరుణాకర్‌రావు వాహనాల తనిఖీలు చేపడుతున్న సమయంలో చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ జుబేద్ ఆటోలో బియ్యం తరలిస్తుండగా.. ఐదు క్వింటాళ్ల 69 కిలోల బియ్యం పట్టుబడింది. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

ఎదులాపురం: పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పొగకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. యువత పొగాకు ఉత్పత్తులకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలిగే అనర్థాలను యువతకు వివరించాలన్నారు. సిగరెట్లు తాగడం, గుట్కా, ఖైని, అంబర్ లాంటి పదార్థాలు వాడటం వలన నోటి క్యాన్సర్, ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. పిల్లలు పొగాకు ఉత్పత్తులు వాడినట్లు గుర్తిస్తే తల్లిదండ్రులు వెంటనే దగ్గరలోని మానసిక నిపుణుల వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్లు వెంకట రమణ, శ్రీనివాస్, చిరంజీవి, పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు


హారతి తీసుకుంటున్న భక్తులు


పూజలు చేస్తున్న అర్చకుడు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని సాయినగర్‌లో రేణుకామాత ఆలయంలో గీత కార్మిక సహకారం సంఘం, ఆలయ అర్చకులు నెమలికొండ బాలు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శనివారం రేణుకామాత అన్నపూర్ణ శాకాంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకం, చతుర్ శక్తి పూజ, మహా హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు ఫణిందర్ శర్మ, అనంత శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాందేవ్ గౌడ్ పాల్గొన్నారు.
– ఆదిలాబాద్‌రూరల్

వెంకటస్వామికి ఘన నివాళి


కాకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఎంతో మంది పేదలకు తన సొంత ఖర్చుతో ఇళ్లు కట్టించి కాకాగా పేరు తెచ్చుకున్న ఆదర్శనీయుడు గడ్డం వెంకటస్వామి అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ అన్నారు. మాజీ కేంద్ర మంత్రి కాకా 95వ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వెంకటస్వామి ఎంతో కృషి చేశారని కొనియాడారు. వెంకటస్వామి కుటుంబమంతా ప్రజా సేవలోనే కొనసాగుతుండటం ఆయన చేసిన సేవల ఫలితమేనన్నారు. వెంకట స్వామి ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుల వెంకన్న, కిషన్, రఫీక్, రాజేశ్వర్, ఖయ్యూమ్, రామ్‌రెడ్డి, గడ్డం అఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కాకా జయంతి

కైలాస్‌నగర్: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలను శనివారం జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. జెడ్పీ కార్యాలయంలో సీఈవో జితేందర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో కలిందిని, డీఆర్‌డీఓ కార్యాలయంలో డీఆర్‌డీవో సాయన్న , ఏపీడీ కుటుంబ రావు, ఏవో అందె గంగాధర్‌లు కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రిగా ఆయన చేసిన సేవలను స్మరించుకుని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సూపరింటెండెంట్ ఎస్.సుధాకర్, కిరణ్ కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

ఇబ్బందులు లేకుండా సోయా కొనుగోళ్లు చేయాలి

ఇచ్చోడ: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సోయా కొనుగోళ్లు చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోయా కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతు అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఆదుకునే వారే కరువయ్యారని ఆరోపించారు. సోయా కొనుగోళ్ల కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలన్నారు. దళారులు వద్ద కానీ మహారాష్ట్ర నుంచి వచ్చే సోయాలను కొనుగోళ్లు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, డీసీవో మోహన్, మార్కెట్ కార్యదర్శి రమేశ్, సహకార సంఘం సీఈవో ఈశ్వర్, చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 44వ జాతీయ రాహదారి గాంధీనగర్ నుంచి కామాగిరి వరకు కోటి 80 లక్షలతో నిర్మించనున్న బీటీ రిన్యూవల్ పనులకు భూమిపూజ చేశారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పరామర్శ


పరామర్శిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుల్లో ఒకరైన జామా మసీదు సదర్ మొయిజ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన తాంసి సహకార సంఘం కార్యదర్శి గణేష్ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాగా మెరుగైన వైద్యం కోసం గణేష్‌ని హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం హైదరాబాద్‌లోని హస్పిటల్‌లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి గణేష్‌ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వారి వెంట డైరెక్టర్ అశోక్ రెడ్డి, సీఈవో కేశవ్, తదితరులు ఉన్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్


మాట్లాడుతున్న నాగన్న


మాట్లాడుతున్న అరెల్లి మల్లేశ్

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేశ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా ఈనెల 9న జిల్లా కేంద్రంలో నల్ల జెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేయడం సరికాదన్నారు. మాల నాయకులు చేస్తున్న బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడవద్దన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిట్టి రవి, సిరిసిల్ల భూమయ్య, జనారపు సాయి, కాశిపాక విష్ణు, మచ్చ గంగయ్య, అన్నెల రమేశ్, పసుల శ్రీకాంత్, మచ్చ అజయ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిపల్లి నాగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో శనివారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై అభిప్రాయాలు స్వీకరిస్తున్న నేపథ్యంలో తక్షణమే ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మాదిగ ఉపకులాలకు విద్యా, ఉద్యోగ రంగాలలో న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉపకులాల ప్రజలు మెయిల్స్, లెటర్స్ ద్వారా హైదరాబాదులోని దామోదర సంజీవయ్య భవన్ మాసబ్ ట్యాంక్ అడ్రస్‌కు అభిప్రాయాలు పంపించాలని కోరారు. కార్యక్రమంలో మనోజ్, రాందాస్, గంగాధర్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో లక్కారం మాజీ సరపంచ్ మర్సుకోల తిరుపతి, ఆయన సతీమణితో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ నుంచి 250 మంది కాంగ్రెస్‌లో చేరారన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యూం, చంద్రయ్య, ఎక్బాల్, దూట ఆజేశ్వర్, కలీం, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. సురేశ్ జోషి, కవిత జోషి దంపతులు తమిళనాడులోని కుమారుడి దగ్గరికి రెండు రోజుల కిందట వెళ్లారు. కాగా శనివారం కొందరూ ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి అతనికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. బంధువులు, మిత్రులు అక్కడికి చేరుకొని లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో దొంగతనం జరిగిందని, బీరువా పగలగొట్టి బంగారం, డబ్బు, ఇతర విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయమై ఎస్సైని సంప్రదించగా డయల్ 100కు కాల్ వచ్చింది. అక్కడికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో ఉన్న వస్తువులు చిందవందరగా పడేసి ఉన్నాయి. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంలో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

జాబ్ మేళాకు స్పందన


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: దుబాయిలో డెలివరీ బాయ్స్ కోసం ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళకు అనూహ్య స్పందన లభించింది. శనివారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ జాయినింగ్ మేనేజర్ రితీష్ అభ్యర్థులకు సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు పరిశీలించారు. పని చేయాల్సిన స్థలం, వేతనం తదతర వాటి గురించి వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా టాంకం కంపెనీ ద్వారా దుబాయిలో డెలవరీ బాయ్స్ కోసం జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఈనెల 10న అభ్యర్థులకు హైదరాబాద్‌లోని తమ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. ఇండియా లైసెన్స్ కలిగిన వారికి అక్కడ నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దుబాయి లైసెన్స్ ఉన్న వారికి ఎలాంటి శిక్షణ ఉండదన్నారు. ఇందులో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రోడ్డ శ్రీనివాస్, ఎంప్లాయిమెంట్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గోవర్ధన్, కంపెనీ కోర్సు కోఆర్డినేటర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ రాహుల్

ఆదిలాబాద్‌టౌన్: తప్పుడు బోనఫైడ్ జారీ చేసిన ఉట్నూర్ మండల కేంద్రంలోని సన్ షైన్ ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ రాహుల్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఒకే విద్యార్థికి వేర్వేరు అడ్మిషన్ నంబర్ (12, 52)లతో రెండు బోనాఫైడ్స్ జారీ చేశారని ఆరోపించారు. ఇష్టం వచ్చినట్లు డబ్బులు వసూలు చేస్తూ తప్పుడు రికార్డులు సృష్టిస్తున్న యజమాన్యం చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న విద్యాసంస్థల అనుమతి రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్, ఏఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న అన్నమొల్ల కిరణ్

ఎదులాపురం: మహిళా స్వయం సహాయక సంఘాలలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం పలువురు ఆర్పీలు యూనియన్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఆర్పీలు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. గత 20 ఏళ్లుగా మహిళలకు అండగా నిలుస్తున్న ఆర్పీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఎలాంటి గుర్తింపునివ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్, అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శి నవీన్ కుమార్, పద్మ, ధనలక్ష్మి, రేవతి, మంజుల, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

భీం వర్ధంతి విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఈనెల 17న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించే కుమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని తన క్యాంపు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. జల్‌జగల్ జమీన్ నినాదంతో నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కార్యక్రమంలో కుమురం భీం మనుమడు సోనేరావు, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, మంగి మాజీ సర్పంచ్ కోట్నాక్ గణపతి, కళావతి, మాధవ్ పాల్గొన్నారు.

సివిల్ సప్లై కార్మికుల సంబురాలు


స్వీట్లు పంచుకుంటున్న కార్మికులు

ఇచ్చోడ: సివిల్ సప్లై కార్మికుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో శనివారం మండల కేంద్రంలోని గోదాం వద్ద సివిల్ సప్లై కార్మికులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహయ కార్యదర్శి కల్లెపల్లి గంగయ్య మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలితంగా సివిల్ సప్లై గోదాంలలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కరించిందన్నారు. పోరాటాల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కరించుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై కార్మికులు శంకర్, రాజేందర్, నరేశ్, వన్నెల లక్ష్మణ్, సాయికుమార్, నరేశ్, వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

సామాజిక సేవ తృప్తినిస్తుంది


వైద్య శిబిరంలో పాల్గొన్న డీఎస్పీ నాగేందర్

గుడిహత్నూర్: సామాజిక సేవతో ఎంతో తృప్తి కలుగుతుందని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, డీఐ శ్రీలత అన్నారు. మండలంలోని గర్కంపేట్ గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లోని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయడం అభినందనీయమన్నారు. జైదేవి మెడికల్ యజమాని గిత్తే మదన్, మెడికల్ ఆఫీసర్ శ్యాంసుందర్, ఎస్సై ఇమ్రాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మ్యూజియం ఏర్పాటు హర్షణీయం

నార్నూర్: మహారాష్ట్రలోని బంజారా కాశీ పొహరాదేవి పుణ్యక్షేత్రంలో నంగారా మ్యూజియంను కేంద్ర ప్రభుత్వం రూ. 500 కోట్లతో నిర్మించడం హర్షణీయమని బంజారాసేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బంజారా సమాజం సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, రాథోడ్ ఉత్తం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్,. తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి


సర్వేలో పాల్గొన్న చైర్మన్

ఖానాపూర్: డిజిటల్ ఆరోగ్య కార్డుల జారీలో భాగంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టు సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో జెడ్పీ సీఈవో గోవింద్‌తో కలిసి సర్వేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జన్నారపు శంకర్, పరిమి సురేశ్, తొంటి శ్రీనివాస్, దయానంద్, రమేశ్, రాజేందర్, శేషాద్రి తదితరులున్నారు.

సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ


బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు

నార్నూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో శారద ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంధాలకు, అనుబంధాలను గుర్తు చేస్తూ.. ప్రకృతిని ఆరాధిస్తూ పండుగ జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్, ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శి మోతిరాం, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.